## వాహనాలను భద్రంగా... బాధ్యతతో నడపాలి




ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం | 23 జనవరి, 2026 | పేజీలు :06

# పదిలో నూరు శాతం ఫలితాలే టార్గెట్

ప్రత్యేక తరగతుల నిర్వహణలో అలసత్వం చేయొద్దు
ప్రత్యేక అధికారులు స్కూళ్ల సందర్శనపై దృష్టి పెట్టాలి
విద్యాశాఖ సమీక్షలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగర్:** పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ప్రత్యేక అధికారులు దృష్టి పెట్టాలని, ప్రత్యేక తరగతుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో పదవ తరగతి పరీక్షల సన్నాహక సమావేశం విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగింది. ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, ప్రత్యేక అధికారులు, కేజీబీవీ, మోడల్, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్‌లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప ఏ విద్యార్థికీ సెలవు ఇవ్వరాదని ఆదేశించారు. అన్ని పాఠశాలలు, కేజీవీబీలు, గురుకులాలు, మోడల్ స్కూల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి పదవ తరగతి పాస్ అవ్వడమే లక్ష్యంగా సమిష్టి కృషి చేయాలని తెలిపారు. చదువులో వెనుకబడిన పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ఆ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ప్రోత్సహించాలని అన్నారు. ప్రత్యేక తరగతుల నిర్వహణలో అలసత్వం వహించినా, ప్రత్యేక అధికారులు పాఠశాల సందర్శనలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్నేహిత ఫిర్యాదుల పెట్టెల తాళాలు మహిళా పోలీసులకు అప్పగించాలని ఆదేశించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల అవసరాలకు నివేదిక సమర్పించాలని అన్నారు. అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాధికారి అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ ఇంకా సిలబస్ పూర్తి కాని పాఠశాలలు ఉంటే వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థుల సన్నద్ధత ప్లానింగ్ లో ఉన్న అంశాలను ఆయా పాఠశాలలు అమలు చేస్తున్నదీ లేనిదీ ప్రత్యేక అధికారులు తనిఖీ చేయాలని అన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో డిసిఇబి కార్యదర్శి భగవంతయ్య, విద్యాశాఖ కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి పాల్గొన్నారు.




---

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో
# వేగం పెంచాలి: ఇన్‌చార్జి కలెక్టర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సీఎం కప్ పోటీల నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, సమ్మర్ యాక్షన్ ప్లాన్ పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి హౌసింగ్, మిషన్ భగీరథ, డీవైఎస్ఓ, మున్సిపల్ కమిషనర్లతో కలిసి ఇంచార్జి కలెక్టర్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవి రాక ముందే అన్ని సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్ళాలని సూచించారు.

**షెడ్యూల్ ప్రకారం పోటీలు నిర్వహించాలి..**
సీఎం కప్ పేరిట గ్రామ స్థాయి నుంచి ప్రతిభ ఉన్న విద్యార్థులు, యువత వెలికి తీసి జాతీయ స్థాయి,అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. తమ పరిధిలోని గ్రామీణ క్రీడ ప్రాంగణాలను వినియోగించుకోవాలని సూచించారు.


**ప్రతి రోజూ పర్యవేక్షించాలి:** జిల్లాలోని అన్ని మండలాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను సంబంధిత అధికారులు ప్రతి రోజూ పర్యవేక్షించాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలు, మున్సిపల్ కమిషనర్లు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పరిశీలించాలని, లబ్దిదారుల కావాల్సిన ఇటుకలు, సామగ్రి వివరాలు అందించాలని సూచించారు. **ఎస్సీ స్టడీ సర్కిల్ ఫౌండేషన్ కోర్సు ను సద్వినియోగం చేసుకోవాలి:** తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డు కులాల స్టడీ సర్కిల్,రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించే202526సంవత్సరానికి ఐదు (5)నెలల ఫౌండేషన్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర షెడ్యూల్డు కులాల స్టడీ సర్కిల్,రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించే202526సంవత్సరానికి ఐదు (5)నెలల ఫౌండేషన్ కోర్సును(రాష్ట్రస్థాయి అన్ని పోటీ పరీక్షలతో పాటుగా,కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కొరకు బ్యాంకింగ్,ఆర్.ఆర్ బీ,ఎస్.ఎస్.సీ అన్ని ఇతర పోటీ పరీక్షలు),భోజన వసతి సౌకర్యాలతో పాటు స్టడీ మెటీరియల్స్ అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన అర్హులైన ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ,దివ్యాంగ స్త్రీ/పురుష అభ్యర్థుల నుంచి ఆన్లైన్లోhttp://tsstudycircle.co.inఈ నెల30 012026వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు డైరెక్టర్ స్టడీ సర్కిల్ ఫోన్ నెంబర్8341387700లో సంప్రదించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్డీఓ గీత, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, డీడబ్ల్యూఓ లక్ష్మి రాజం, డీవైఎస్ఓ రాందాస్, మిషన్ భగిరథ ఈఈలు అన్వర్, సుమలత, హౌసింగ్ పీడీ శంకర్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు ఉన్నారు.

---

### అధికారులరా జగిత్యాల మండలంలో
# అనుమతులు ఉన్న ఇటుక బట్టీలు ఉన్నాయా?

నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలు,
అక్రమ ఆదాయమే ధ్యేయంగా నిర్వహణ
పట్టించుకోని జగిత్యాల మండల సంబంధిత
అధికార యంత్రాంగం

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్:** గ్రామాలలో ఇటుక బట్టీల ఏర్పాటుకు పాలు శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. అందులో గ్రామ పంచాయతీ, రెవెన్యూ,కాలుష్య నియంత్రణ మండలి, మైనింగ్ శాఖల నుండి తప్పనిసరి అనుమతులు తీసుకోవాలి. నివాస ప్రాంతాలు, రహదారులకు నిర్దేశించిన దూరంలో ఇటుక బట్టిలను ఏర్పాటు చేసుకోవాలి. అధికారులరా జగిత్యాల మండలంలో అనుమతులు ఉన్న ఇటుక బట్టీలు ఉన్నాయా.....? జగిత్యాల మండలంలోని ఇటుక బట్టిలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువైపోయింది. జగిత్యాల మండలంలోని పలు గ్రామ పంచాయతీల పరిధిలో ఇటుక బట్టిలను ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీల ఏర్పాటుతో అక్రమ ఆదాయమే ధ్యేయంగా ఇటుక బట్టీల ఏర్పాటు నిర్వహణ ఇష్టారాజ్యంగా కొనసాగుతోందని జగిత్యాల మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. జగిత్యాల మండలంలోని నిర్వహిస్తున్న ఆయా గ్రామల ఇటుక బట్టిలపై జగిత్యాల మైనింగ్, రెవెన్యూ శాఖ, గ్రామ పంచాయతీ అధికారులు నిమ్మకూరెనెత్తకుండా ఉంటున్నారనే విమర్శలు మండలంలో జోరందుకుంటున్నాయి. జగిత్యాల మండలంలో దాదాపుగా పదిహేను నుంచి ఇరవై వరకు ఇటుక బట్టీలు ఉండగా అందులో రెండు మూడు ఇటుక బట్టీలకు తప్ప మిగతావాటికి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని పక్క సమాచారం. అధికారులరా జగిత్యాల మండలంలో అనుమతులు ఉన్న ఇటుక బట్టీలు ఉన్నాయా....? అని జగిత్యాల మైనింగ్, రెవెన్యూ శాఖ, ఆయా గ్రామ పంచాయతీ, సంబంధిత అధికారులను జగిత్యాల మండల ప్రజలు ప్రత్యేక్షంగా ప్రశ్నిస్తున్నారు.ఇటుక బట్టీలను నివాస ప్రాంతాలకు, పొలాలకు దగ్గరగా నిర్వహిస్తున్న ఇటుక బట్టిలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో జగిత్యాల మండల సంబంధిత అధికారులపై ఆయా గ్రామల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి జగిత్యాల మండలంలో నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టలను నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



# వైద్య సేవల నాణ్యత పెంచడంపై దృష్టి సారించాలి

**ప్రజాపక్షం/వేములవాడ:** ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు అందించే వైద్య సేవల్లో నాణ్యత పెంచడంపై దృష్టి సారించి, పారదర్శకమైన వైద్య సేవలు అందించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.గురువారం వేములవాడ పట్టణం తిప్పాపూర్ లోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని ఇంచార్జి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఓపీ రిజిస్టర్, అత్యవసర విభాగం, డీఈఐసీ (డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్)తో పాటు ఇతర విభాగాలను సందర్శించారు. ఆసుపత్రికి రోజూ వచ్చే పేషెంట్ల సంఖ్య,



అత్యవసర సేవల నిర్వహణ, ప్రసూతి విభాగంలో జరుగుతున్న డెలివరీల వివరాలపై వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, గర్భిణీ మహిళలకు మెరుగైన ప్రసూతి సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో ఉన్న ఆడియోమెట్రిక్ మెషిన్‌ను, అందుబాటులో ఉన్న వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని, వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.ఆసుపత్రిలో ఆర్ఎంఓ డా.రవీందర్, సివిల్ సర్జన్ డా.పెంచలయ్య తదితరులు ఉన్నారు.

## అరైవ్, అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/కరీంనగర్:** నగరంలోని మానేరు రివర్ ఫ్రంట్, లేక్ పోలీస్ అవుట్‌పోస్ట్ పరిధిలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే ఉద్దేశంతో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, మరియు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా డ్యామ్ పరిసర ప్రాంతాల్లో వాకర్స్ మరియు విద్యార్థులతో కలిసి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటస్వామి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. బైక్‌లపై ముగ్గురు ప్రయాణించడం చట్టవిరుద్ధం, ప్రమాదకరం అన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, ఇతరుల ప్రాణాలకు నష్టం కలిగించకూడదన్నారు. వయసు నిండని పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని తెలిపారు. మితిమీరిన వేగం ప్రమాదాలకు ప్రధాన కారణం, కావున వేగ నియంత్రణ పాటించాలన్నారు. అనంతరం, రోడ్డు నిబంధనలను పాటిస్తామని, తోటి వారికి అవగాహన కల్పిస్తామని, ప్రమాదాల రహిత సమాజం కోసం కృషి చేస్తామని విద్యార్థులు మరియు వాకర్స్‌తో అధికారులు ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ రాంచందర్ రావు, లేక్ పోలీస్ అవుట్‌పోస్ట్ ఆర్.ఎస్.ఐ (RSI) రమేష్, ఇతర పోలీస్ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన తాజా మాజీ జెడ్‌పిటిసి

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి తాజా మాజీ జెడ్పిటిసి సభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు బత్తిని అరుణ బిజెపి లో చేరారు.ఈమేరకు గురువారం హైదరాబాద్ లోని బిజెపి కార్యాలయంలో అరుణకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అరుణ తోపాటు మేరు సంఘం నాయకులు కొత్తకొండ రాజు,యువ న్యాయవాది బత్తిని ఇంద్రకరణ్, నక్క నగేష్,బత్తిని వీణ,బోయినపల్లి గంగారాం, గొల్లపల్లి రాజేష్,రేణికుంట శ్రీకాంత్, గట్ల అనిల్,హర్షవర్ధన్ లు సైతం బిజెపి తీర్థం పుచ్చుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు మాట్లాడుతూ త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కంకనబద్ధులై బిజెపి జెండా ఎగరవేయాలని సూచించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామెరరాం సుధాకర్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికలు జరగ్గా పార్టీ మండల,పట్టణ అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, గాజు భాస్కర్,జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, జిల్లా నాయకులు నల్లబెల్లి సుజన్ రెడ్డి, పాల్గొన్నారు.

## జిల్లాలను తొలగిస్తామంటే చావు దెబ్బ తప్పదు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజల సౌలభ్యం కొరకు అత్యంత సన్నిహితంగా జిల్లా కార్యాలయాలను, అధికారులను ఏర్పాటు చేస్తే జిల్లాలను తొలగిస్తామంటే ప్రజల చేత చావు దెబ్బ తప్పదని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. గురువారం జిల్లా బిఆర్ఎస్ భవన్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రేవంత్ రెడ్డి ఇలాంటి తుగ్లక్ పనులను మానుకోవాలని హెచ్చరించారు. చేయగలిగితే కేసిఆర్ చేసిన దాని కంటే ఎక్కువ చేయాలన్నారు. మీ ప్రభుత్వం చేయలేని పనులను కేసీఆర్ చేశాడని 30 సంవత్సరాల క్రితం తాండాలను గ్రామపంచాయతీలుగా చేస్తామని మీ ప్రభుత్వం చేయలేదని విమర్శించారు. కెసిఆర్ ఇచ్చిన మాటలను తప్పకుండా కొత్త గ్రామపంచాయతీలు, కొత్త మండలాలు, కొత్త డివిజన్లు ఏర్పాటు చేసుకున్నాం అన్నారు. జిల్లాలను కూడా ఏర్పాటుచేసి ప్రజల మనుషులను కెసిఆర్ గెలుచుకున్నారన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కావడం చేత కలెక్టరేట్ కార్యాలయం, మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్, ఇంజనీరింగ్ కాలేజ్ ఎన్నో హంగులతో ప్రజలకు దూర భారం



తగ్గింది అన్నారు. ఇలాంటి జిల్లాలను ఎత్తివేస్తామంటే ప్రజలు తప్పక బుద్ధి చెబుతారని ఆ పోరాటానికి మేమే నాయకత్వం వహిస్తామని హెచ్చరించారు. తుగ్లక్ పనులను మానుకోవాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికలకు మా పార్టీ సర్వం సన్నద్ధంగా ఉందన్నారు. ప్రతి వార్డులకు ఇన్చార్జిలం నియమించామన్నారు. సర్వ సన్నద్ధంగా ముందుకి వెళ్లి తప్పకుండా విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, కొండూరి రవీందర్ రావు, చీటీ నర్సింగరావు, చిక్కాల రామారావు, సుంకె రవిశంకర్,జిందం చక్రపాణి, దారుణం లక్ష్మీ నారాయణ, మంచే శ్రీనివాస్, అడ్డగట్ల మురళి, కల్లూరి రాజు, దిడ్డి శ్రీనివాస్, రామ్మోహన్, సత్తార్, మల్లారెడ్డి, పూర్ణచందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## శాతవాహనలో 24న మెగా ఉద్యోగ మేళా

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** శాతవాహన విశ్వవిద్యాలయంలో ఈ నెల 24న మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి ఆచార యు. ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్ తెలిపారు. శాతవాహన వర్సిటీ నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ కలిసి జనవరి 24 ఉదయం 9 గంటలకు విశ్వవిద్యాలయంలో ఉద్యోగ మేళా ప్రారంభం కానుందన్నారు. ఈ కార్యక్రమానకి ముఖ్య అతిథిగా తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి, రిటైర్డ్ ఐఏఎస్ ఆరంభించనున్నారు. ఈ మెగా జాబ్ మేళాలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మసీ, నర్సింగ హాస్పిటాలిటీ, బ్యాంకింగ్, రిటైల్, ఎఫ్ఎంసిజ, మేనేజ్‌మెంట్ వంటి 60కి పైగా కార్పొరేట్ కంపెనీల్లో 5వేలకు పైగా ఉద్యోగాల్లో నియామకాలు ఉంటాయని, జీతం సంవత్సరానికి కనీసం రూ.1.20 లక్షల వరకు గరిష్టంగా 4.50 లక్షల వరకు లభిస్తుందని తెలిపారు. పదవతరగతి, ఇంటర్, డిప్లొమా,ఐటిఐ, ఎంఎస్‌సి, ఎంకామ్, ఎంబిఏ, ఎంసిఏ, బిఫార్మసీ, ఎం,ఫార్మసీ, అర్హత కలిగన అభ్యర్థులు ఈ జాబ్ మేలాలో పాల్గొన్న అభ్యర్థులలో కనీసం 25 శాతం నుంచి 30 శాతం మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ మనోహర్, ఓఎస్‌డి టు విసి డాక్టర్ డి.హరికాంత్, సైన్స్ కలాశాల ప్రిన్సిపాల్ రమకాంత్, ఆర్ట్స్ కలాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌కు భారీ షాక్

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ జిల్లాలో బిఆర్ ఎస్ కు భారీ షాక్ తగిలింది. జిల్లా పరిషత్ తాజా మాజీ ఛైర్మన్, బీఆర్ఎస్ నేత కనుమల్ల విజయ గణపతి దంపతులు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో కరీంనగర్ లోని ఎంపీ కార్యాలయంలో గురవారం బీజేపీలో చేరారు. విజయగణపతి దంపతులిద్దరికీ కేంద్ర మంత్రి కాషాయ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వారితోపాటు జమ్మికుంటకు



చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీ కండువా కప్పుకున్నారు. అనంతరం బండి సంజయ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో జరిగిన అభివృద్ధే ఎజెండాగా ప్రజల్లోకి వెళతామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్ సహా తన పార్లమెంట్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో అంతో ఇంతో అభివృద్ధి జరిగిందంటే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతోనే సాధ్యమైందని తెలిపారు. స్మార్ట్ సిటీ, అమ్రుత్ 1, 2, స్వచ్ఛ భారత్ వంటి పథకాలతో పాటు 14, 15, 16వ ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులతోనే కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, కరీంనగర్ మాజీ మేయర్ డి.శంకర్, రమేశ్, బీజేపీ జమ్మికుంట నేతలు ఆకుల రాజేందర్, పుప్పాల రఘు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న నీటి వనరుల గణన పరిశీలన

**ప్రజాపక్షం/వీణవంక:** వీణవంక మండలంలోని పల్బాపూర్ గ్రామంలో గురువారం చిన్ననీటి వనరుల గణనను జిల్లా గణాంకాధికారి వి.కిషన్‌రావు, మండల తహసీల్దార్ రాజమల్లుతో కలిసి పరిశీలించారు. ఈ సంధర్భంఆ వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రాంమాల రైతులు వారి బావులను జియో ట్రేసింగ్ చేయడానికి సహకరించాలని, అధికారులు అడిగిన వ్యవసాయ బావులు, విస్తీర్ణం వంటి అంశాలను మాత్రమే తెలియజేయాలని అన్నారు. సర్వే పేరుతో వ్యక్తిగత వివరాలు, ఓటిపిలు ఏ అధికారి అడుగరని, ఎవరూ చెప్పవద్దని సూచించారు.

ఈ సర్వేలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంటులు, ఏఈవోలు అన్ని గ్రామాల రైతులు పాల్గొని జిపివోలకు సహకరించి సర్వే విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రణాళికాధికారి జె.రమేష్, ఆర్ఐలు నర్సయ్య, రవి, జిపివో నాగమణి, రైతులు పాల్గొన్నారు.

## సెయింట్‌పాల్స్ హైస్కూల్‌లో ఘనంగా వార్షిక క్రీడా వేడుకలు

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** కరీంనగర్‌లోని సెయింట్‌పాల్స్ హైస్కూల్‌లో 3వ తరగతి నుంచి 10 వతరగతి వరకు విధ్యార్థులతో 40వ వార్షిక స్పోర్ట్స్ మీట్ 2026ను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం 'ఉడాన్ మీ కలలకు రెక్కలు ఇవ్వండి' అనే థీమ్‌తో నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్, కరెస్పాండెంట్ లీనా ప్రియదర్శిని నాయకత్వంలో, చైర్మన్ రాజ్ కుమార్ మార్గదర్శకత్వంలో విజయవంతంగా నిర్వహించారు. క్రీడలు విధ్యార్థుల్లో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, సహకారం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా హైస్కూల్ విధ్యార్థుల కోసం 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందాలు, రిలే రేస్, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, వాలీబాల్ వంటి క్రీడా పోటీలు నిర్వహించారు.

## గంగాదేవిపల్లిలో ఉచిత పశు వైద్య శిబిరం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** పశుసంవర్ధక శాఖ పశు గణన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంయుక్తంగా జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గంగదేవిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ కొలకానీ జలందర్, ఉపసర్పంచ్ ఒరగంటి మని సాయి రాం ప్రారంభించారు.పశు వైద్యాధికారులు డాక్టర్ కాసారపు తిరుపతి గౌడ్, రవీందర్,అశోక్ పశువులకు గర్భ కోశ వ్యాధులకు చికిత్స చేసి రైతులకు మందులు అందించినారు.ఈ సందర్భంగా పశు వైద్యాధికారి రవీందర్ మాట్లాడుతూ పాడి రైతులు పశు సంతతి పెంచుకోవడం కోసం పశువులకు గర్భకోశ చికిత్స చేయించుకోవాలని ఎదకు రాని పశువులకు తగిన మందులు వాడాలని సూచించారు . అనంతరం పశు వైద్యాధికారి డాక్టర్ తిరుపతి గౌడ్ మాట్లాడుతూ శీతాకాలంలో పశువులు ఏదకు వస్తాయి గనుక పశువైద్య శిబ్బందిచే గోపాల మిత్రులచే కృత్రిమ గర్భాదారణ చేయించుకుంటే మేలు జాతి రకపు దూడలు జన్మిస్తాయని అట్టి దూడలకు 15 రోజుల నుండి నట్టల నివారణ మందును త్రాగించాలని తద్వారా దూడలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ రవీందర్,తిరుపతి గౌడ్,అశోక్ పశు వైద్య సిబ్బంది నిశాంత్,నర్సయ్య గోపాల మిత్రులు శ్రీకాంత్,రవీందర్,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశంలో పాల్గొనాలి

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు, కళాశాల ఆధ్యాపకుల సంయుక్త సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆసం సంజీవ్ కుమార్ గురువారం పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రుల ఇండ్ల వద్దకు వెళ్లి కళాశాలలో జరిగే సమావేశాన్ని గురించి వివరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రికను కళాశాల అధ్యాపకులు అందజేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

# మున్సిపల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

**ప్రజాపక్షం/చొప్పదండి:** రాబోయే చొప్పదండి మున్సిపల్ ఎన్నికల్లోని 14 వార్డుల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని కాంగ్రెస్ జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్‌లు స్పష్టం చేశారు. చొప్పదంటి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో చొప్పదండి పట్టణం అన్నిరంగాల్లో వెనుకబాటుకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. మేజర్ గ్రామ పంచాయతీ నుంచి గత పాలకులు మున్సిపాలిటీలగా మార్చినప్పటికీ అభివృద్ధి మాత్రం ఆమద దూరంలోనే ఉంచారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఏకైక మున్సిపల్ పట్టణాన్ని ప్రత్యేక చొరవతో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో వంద పడకల ఆసుపత్రితో పాటు సెంట్రల్ లైటింగ్ పనులకు నిధుల విడుదలలో శ్రద్ధ చూపట్టలేదన్నారు. పట్టణంలో 110 ఇందిరమ్మ ఇండ్లు, స్థలంలేని 168 మంది నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, 3500 రేషన్ కార్డులతో పాటు సన్న బియ్యం పంపిణీ తదితర పనులను ఓర్వలేక, గత పది సంవత్సరాలలో ఎక్కడా సంక్షేమం, అభివృద్ధి గురించి పట్టించుకోని తనకు ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గుర్రం నీరజ భూంరెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పురం రాజేశం, మండల సర్పంచ్‌లు, ఉపసర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, గ్రామశాఖ అధ్యక్షులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ముత్తారం :** గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ సిలివేరి జ్యోతి లక్ష్మణ్ అధికారులను కోరారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మచ్చుపేట గ్రామంలో ప్రజలకి తాగునీరు సరఫరా చేసే పైపు లైన్ కి పలుచోట్ల పగుళ్లు ఏర్పాటు పైప్లైన్ చెడిపోవడంతో గ్రామస్తులు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామంలో నెలకొన్న ఈ పైపెలైన్ సమస్యను స్వయంగా ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కీర్తనకి సమస్యలను చూపిస్తూ మరమ్మత్తులు చేయాలని సర్పంచ్ కోరారు. వారివెంట హౌసింగ్ ఎఈ ఆకుశవాలి, పంచాయితీ కార్యదర్శి దిలీప్,వార్డు సభ్యులు బంధరాపు సాగర్, సంపత్,నాగరాజు, గ్రామ పంచాయితి సిబంది.తో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## కెటిఆర్ ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/ముస్తాబాద్:** గూడెం గ్రామానికి చెందిన గద్దల నరేష్ అనారోగ్యానికి గురై కెల్విన్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన నరేష్ ఆరోగ్య విషయం కొమ్ము బాలయ్య కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లగా నరేష్ ఆనారోగ్య నిమిత్తం తక్షణ సాయం కింద వారి కుటుంబ సభ్యులకు 50,000/రూపాయలు కేటీఆర్ ఆర్థిక సహాయం చేశారని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి గద్దల నరేష్ కు ఆరోగ్యం మెరుగుపడేలా ఆర్థిక సాయం అందించిన కొమ్ము బాలయ్య కేటీఆర్ కి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో షాద శ్రీనివాస్, ఈడుగురాళ్ల సంతోష్ గౌడ్, కొమ్ము కృష్ణ ఉన్నారు.

## డంపింగ్ యార్డ్ పరిశీలన

**ప్రజాపక్షం/ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండలం చీకోడు గ్రామంలోని కరుణాల గుట్ట, గండి చింతలు దగ్గర డంపింగ్ యార్డ్ గతంలో నిర్మాణం చేయడం జరిగిందని ప్రస్తుతం ఆ నిర్మాణం ఆక్రమణకు గురై కానరాకుంట పోయిందని, యధావిధిగా డంపింగ్ యార్డ్ కొనసాగించడానికి ఈ విషయమై మాజీ సర్పంచ్ పోతిరెడ్డి రాజయ్య ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయంలో ఇచ్చిన వినతి పత్రం పై అధికారులు స్పందించారు. వచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం మోకపైకి వచ్చి చూడగా ఆక్రమణకు గురైన భూమిని సర్వే చేయించి ఇస్తామని ఆర్ఐ రఘు, అలాగే సర్వేయర్ జిపిఓ వచ్చి చెప్పినట్లు రాజయ్య పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ మార్కెట్ రోడ్డులోని శ్రీ వేంకటేశ్వర దేవస్థానంలో నేటి నుండి ప్రారంభం కానున్న శ్రీ లక్ష్మి, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బందోబస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురువారం ఆలయ ప్రాంగణాన్ని సందర్శించిన సీపీ, బందోబస్తు మ్యాప్‌ను నిశితంగా పర్యవేక్షించారు. జనవరి 23 నుండి 29వ తేదీ వరకు వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు వెంకటస్వామి, యాదగిరిస్వామి, ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, తిరుమల్, ఖరీముల్లాఖాన్ మరియు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.**రేకుర్తి సమ్మక్క-సారక్క జాతరకు పటిష్ట బందోబస్తు : సీపీ**

రేకుర్తిలో (జనవరి 28 నుండి 31 వరకు) అత్యంత వైభవంగా జరగనున్న సమ్మసారక్క జాతరను పురస్కరించుకొని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం గురువారం బందోబస్తు ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. జాతర జరిగే ప్రాంతాన్ని సందర్శించిన సీపీ, బందోబస్తు మ్యాప్‌ను పర్యవేక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, జాతరకు వచ్చే వేలాది మంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రత కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ విజయకుమార్ ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ మరియు ఇతర పోలీసు అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జి.యంలు



**ప్రజాపక్షం/రామగిరి :** ఈనెల 26న స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను గురువారం రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు పరిశీలించారు. వేడుకలలో భాగంగా నిర్వహించనున్న పరేడ్, ఉత్తమ ఉద్యోగుల సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాల కోసం సివిల్, సెక్యూరిటీ, ఎలక్ట్రికల్, పర్సనల్ విభాగాల ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి పలు సలహాలు, సూచనలు అందించారు. వేడుకల్లో పాల్గొననున్న వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు, సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల ప్రజల కోసం తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన పనులను త్వరితగతిన పూర్తి చేసి వేడుకలు విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం లో గల జిమ్, స్విమ్మింగ్ పూల్, వాకింగ్ ట్రాక్ ఇతర సదుపాయాలను పరిశీలించారు.కార్యక్రమంలో ఎస్వోటుజియంలు యం.రామ్మోహన్, బండి సత్య నారాయణ, సివిల్ డిజియం రాజేంద్ర కుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఎస్ ఐ సతీష్ చక్రవర్తి ఇంచార్జ్ ఏరియా సెక్యూరిటి ఆఫీసర్ కోల శ్రీనివాస్, ఫారెస్ట్ అధికారి మేఘన ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా వందలాది కోట్ల సంపాదన



**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రపంచంలోనే ఎక్కడా లేని భయంకరమైన అవినీతి అనకొండ సునీల్ రావును ఆ డివిజన్ ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ఆరోపించారు. మేయర్ గా ఉన్న సమయంలో వందలాది కోట్ల రూపాయల అవినీతికి పాల్పడి ప్రజలను పీడించి దౌర్జన్యాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఇల్లు కట్టాలన్న అపార్ట్మెంట్ నిర్మించాలన్న షాపు పెట్టుకోవాలన్నా సునీల్ రావు డబ్బులు దండుకునేవారని ప్రజలే బహిరంగంగా చెప్పుకుంటున్నారని ఆరోపించారు. అలాంటి ఆవినీతి ఆనకుండా సునీల్ రావును డివిజన్ ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించబోతున్నారని పేర్కొన్నారు. గురువారం కొత్తపల్లి లోని వెలిచాల ప్రజా కార్యాలయంలో 42వ డివిజన్ కు చెందిన పశుసంవర్ధక శాఖ రిటైర్డ్ జిల్లా అధికారి డాక్టర్ పంజాల రాజన్న గౌడ్ 150 మంది డివిజన్ ప్రజలు, మహిళలు యువకులతో కలిసి వెలిచాల రాజేందర్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. డాక్టర్ రాజన్న గౌడ్ కు రాజేందర్ రావు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజేందర్‌రావు మాట్లాడుతూ 42వ డివిజన్ కు చెందిన రాజన్న గౌడ్ నీతికి నిజాయితీకి మారుపేరని విద్యార్థి నేతగా ఉన్న సమయంలో అలుపెరగని ప్రజా పోరాటం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఆకుల నరసన్న, ఆర్ష మల్లేశం మల్లికార్జున రాజేందర్ గుడూరి మురళి కోటగిరి భూమా గౌడ్ వేల్పుల వెంకటేష్ ,పడాల అజయ్ గౌడ్ కొత్తూరు జగన్ గౌడ్ నేరేళ్ల నాగన్న గౌడ్, పలువురు కాంగ్రెస్ నాయకులు డివిజన్ ప్రజలు యువకులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/వీర్నపల్లి :** మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఉపయోగపడేవిధంగా ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకొని, పని దినాలు నష్టపోకుండా చూసుకోవాలని తెలిపారు.

కూలీలకు గతంతో చూస్తే కూలి రేట్లను దేశవ్యాప్తంగా ప్రభుత్వం పెంచిందని గుర్తు చేశారు. అడవి ప్రాతంలో నీటి నిలువలు ఉండేలా చిన్నపాటి చెక్ డ్యాంల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను కోరారు. అలాగే ఉపాధి హామి పథకం క్రింద పలు రకాల పనులను ఉపయోగించుకునేందుకు ప్రజలు అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేష్, ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, వైస్ చైర్మన్ లక్ష్మ ణ్, వార్డు సభ్యులు భగవంతం, లావణ్య, రోజా, సురేష్, గోరేమియా, లక్ష్మీ నారాయణ, రాజు పాల్గొన్నారు.

## 'అరైవ్ అలైవ్'తో రోడ్డు భద్రతపై అవగాహన

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలోని మెయిన్ సర్కిల్‌లో స్థానిక ఎస్ఐ వేముల లక్ష్మ ణ్ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' థీమ్‌తో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రోడ్డు భద్రత వారాత్సవాలలో భాగంగా అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్, సీటు బెల్టు ధరించకపోవడం, మొబైల్ వాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి పలు అంశాలపై వాహనదారులతో చర్చించారు. ప్రతి ఒక్కరు బాధ్యతయుతంగా వాహనాలు నడుపుతూ, ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రమాదాల నుండి రక్షించుకోవాలని సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారితో హెల్మెట్ కొనిపించి, వాటి ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, స్థానిక యువకులు పాల్గొన్నారు.

## ఎర్రకోటలో డప్పుకళాకారుని ప్రదర్శనలో రాజన్నపేటవాసి..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండలంలోని రాజన్నపేట గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు ముక్కపూర్ణచందర్‌కు అరుదైన అవకాశం లభించింది,ఘనతంత్ర దినోత్సవాలు పురస్కర్చికుని డిల్లీలో నిర్వహించే వేడుకలలో కళాప్రదర్శన ఇచ్చేందుకు ఉస్తేద్‌బిస్మిల్లాఖాన్ జాతీయ ఆవార్డు గ్రహిత అందెభాస్కర్ అద్వర్యంలో 30 మంది కళాకారులకు అవకాశం దక్కింది.కేంద్ర సాంస్కృతిక శాఖ పరిధిలోని నాగాపూర్,సౌత్ సెంట్రల్ జోన్ కల్చర్ వారి ఆహ్వానం మేరకు డప్పు కళా ప్రదర్శించడానికి ముక్కపూర్ణచందర్‌కు అవకాశం దక్కింది,రాష్ట్రపతి,ఉపరాష్ట్రపతి,ప్రధానమంత్రి పాల్గొనే దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన కళాకారులలో తెలంగాణ నుండి పూర్ణచందర్‌కు అవకాశం రావడంపై వారి బంధువులు ,గ్రామస్థులు,హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అద్దెబస్సులే ప్రమాదానికి కారణమా...

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండలంలోని కామారెడ్డిరాజన్నసిరిసిల్ల ప్రధాన రహదారి మార్గంలో ఎల్లారెడ్డిపేటగొల్లపల్లి మధ్యలో గత మూడునెలల వ్యవధిలో రెండుసార్లు ఎలక్ట్రిక్ బస్సుఢీకొని ఇటవల దుమాలకు చెందిన జూలపల్లి అంజయ్య మృతి చెందగా అదే గ్రామానికి చెందిన కూరుకుంట్ల అనంతయ్య నేడు జరిగిన ప్రమాదంతో మృతి చెందటం భాదకరమన్నారు. ఓవర్‌స్పీడ్‌తో వెళ్ళడమే దీనికి కారణమని స్థానికులు అన్నారు. దుమాలలో విషాదం నిండుకుంది.

## మైనారిటీ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**ప్రజాపక్షం/ధర్మపురి:** జగిత్యాల జిల్లా ధర్మపురి మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో 202627 సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.జ్యోతి తెలిపారు.ఈమేరకు 202627 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ప్రవేశం కోసం ఆన్ లైన్ అడ్మిషన్ నమోదు కార్యక్రమాన్ని గురువారం జగిత్యాల జిల్లా వక్ఫ్ బోర్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు మహ్మద్ షబ్బీర్,ధర్మపురి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహ్మద్ రఫియోద్దీన్ లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాలకుల జోక్యంతో సింగరేణికి అప్రతిష్ఠ

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** కొంతమంది అధికారులు రాజకీయాలకు లొంగిపోవడం, పాలకుల అనవసర జోక్యం వల్ల సింగరేణి సంస్థ అప్రతిష్ఠ పాలవుతోందని సెంటర్ ఫర్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి ఆరోపించారు. గురువారం నస్పూర్ మండలం శ్రీరాంపూర్ ప్రాంతంలోని ఆర్‌కె న్యూటెక్ గనిపై పిట్ కార్యదర్శి పెరిక సదానందం అధ్యక్షతన ఏర్పాటు చేసిన ద్వార సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు, యూనియన్లు మారినా సింగరేణి కార్మికుల సమస్యలు మాత్రం మారడం లేదని, సింగరేణిలో అవుట్ సోర్సింగ్ కంపెనీల టెండర్లలో భారీ అవినీతి జరుగుతోందని, అందుకే టెండర్లు రద్దు చేసే పరిస్థితి వచ్చిందని రాజారెడ్డి మండిపడ్డారు. నైని బ్లాక్‌తో పాటు గత మూడేళ్లుగా జరిగిన అన్ని టెండర్లపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో పనిచేసిన కొందరు అధికారులు పదవీ విరమణ తర్వాత ప్రైవేట్ కంపెనీలలో చేరుతూ సంస్థ లోగుట్టును బయటపెడుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తెస్తున్న కొత్త చట్టాల వల్ల బొగ్గు గని కార్మికుల వేజ్ బోర్డు, ప్రావిడెంట్ ఫండ్స్ ప్రమాదంలో పడే అవకాశం ఉందని హెచ్చరించారు. కార్మికుల హక్కుల రక్షణ కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

## సింగరేణి ఆదాయం ముఖ్యమంత్రి కుటుంబం పాలు

బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి సంస్థను ఏటిఎంలా వాడుకుంటూ కార్మికులను నట్టేట ముంచుతోందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. ఎన్నికల వేళ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నస్పూర్ లోని జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట బిజెపి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పార్టీ శ్రేణులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇద్దరూ కలిసి సింగరేణి నిధులను ఇతర పథకాలకు మళ్లిస్తున్నారని ధ్వజమెత్తారు. సంస్థలోని కీలక కాంట్రాక్టులను ముఖ్యమంత్రి తన కుటుంబ సభ్యులకు కట్టబెట్టి ఆదాయాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో సింగరేణిని దోచుకోగా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే బాటలో పయనిస్తోందని మండిపడ్డారు. క్వార్టర్ల మరమ్మతులు, నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు, రిటైర్డ్ కార్మికులకు రెండు గుంటల భూమి ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ నమ్మకద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే వరకు బిజెపి రాజీలేని పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ ధర్నాలో బిజెపి నాయకులు ఎనగందుల కృష్ణ మూర్తి, పానుగంటి మధు, సత్రం రమేష్, కుర్రె చక్రవర్తి, ఆనంద్ కృష్ణ, కమలాకర్ రావు, మొగిలి, సుమన్, సదయ్య, సదానందం, శ్రీకాంత్, విక్రమ్, చిరంజీవి, తిరుపతి, శ్రీనివాస్, తిరుపతి, మహేశ్వరి, జ్యోతి, విజయ్, స్వప్న రెడ్డి పాల్గొన్నారు.

## అగ్ని వీర విజేతలకు సన్మానం



**ప్రజాపక్షం/లోకేశ్వరం :** ఇటీవల విడుదలైన అగ్నివీర్,నేవీ సీనియర్ సెకండరీ రిక్రూట్,జనరల్ డ్యూటీ కానిస్టేబుల్ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు మోహన్ రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.స్థానిక బైంసా పట్టణంలోని బైంసా జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలో జరిగిన ఈ కార్యక్రమంలో ముధోల్ నియోజకవర్గానికి చెందిన 15 మంది యువతరంగ్ డిఫెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థులను ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పాటిల్ చేతుల మీదుగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని,చిన్న వయసులోనే దేశ రక్షణలో భాగస్వాములవుతున్న ముధోల్ నియోజకవర్గ విద్యార్థులు అందరికీ గర్వకారణమని తెలిపారు.విద్యార్థులతో పాటు కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు.గత పదకొండు సంవత్సరాలుగా 1600 మందికి పైగా విద్యార్థులను డిఫెన్స్ రంగాల్లో ఉద్యోగాలకు తీర్చిదిద్దిన యువతరంగ్ జూనియర్ కళాశాల, డిఫెన్స్ అకాడమీ సేవలు ప్రశంసనీయమని సంస్థ డైరెక్టర్లు నవీన్ కుమార్,గంగాప్రసాద్ ,సాగర్ గౌడ్,సత్యన్న బైపాల్ చౌదరి తెలిపారు.

## గ్రామ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

సర్పంచ్ కొండ్ర సులోచన



**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని పెంచికలపేట్ మండలంలోని కమ్మర్ గాం సర్పంచ్ కొండ్ర సులోచన అన్నారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వార్డు సభ్యులు, గ్రామ ప్రజలతో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. గ్రామంలోని పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా వంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి సమస్యను గ్రామస్థుల సహకారంతో కలిసికట్టుగా పరిష్కరించి, గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానని స్పష్టం చేశారు. అంతకుముందు వార్డు సభ్యులు తమ వార్డుల్లో నెలకొన్న వివిధ సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కుడిమెత తిరుపతి, నాయకులు భాస్కర్, పంచాయతీ కార్యదర్శి గణేష్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీహరి, ఆశా మరియు అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామ విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** పెంచికలపేట్ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ షేక్ ఉస్మాన్ కోరారు. గురువారం ఆయన స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో లైన్ ఇన్‌స్పెక్టర్ కిషన్‌ను కలిసి గ్రామ పంచాయతీ తీర్మాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో వంగిపోయిన విద్యుత్ స్తంభాలు, కిందికి వేలాడుతున్న వైర్ల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అవసరమైన చోట్ల నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, ప్రమాదకరంగా ఉన్న వైర్లను సరిచేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని తీర్మాన పత్రంలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ప్రతినిధులు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్‌వి పాఠశాలలో నేడు సామూహిక అక్షరాభ్యాసం

ప్రిన్సిపాల్ దీకొండ సంజీవ్ కుమార్



**ప్రజా పక్షం/ రెబ్బన :** ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన మండలంలోని ఎస్‌వి (సాయి విద్యాలయం) ఇంగ్లీష్ మీ డియం హైస్కూల్‌లో ఈనెల 23వ తేదీన వసంత పంచమి పురస్కరించుకొని సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ దీకొండ సంజీవ్ కుమార్ తెలిపారు. చదువుల తల్లి సరస్వతి దేవి జన్మదినం సందర్భంగా వేద పండితుల సమక్షంలో ఈ వేడుకను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని వెల్లడించారు. బాసర పుణ్యక్షేత్రంలోని సరస్వతి దేవి ఆలయంలో అక్షరాభ్యాసం చేయించుకుంటే ఎంతటి పుణ్యం కలుగుతుందో ఇక్కడ నిర్వహించే పూజల ద్వారా అంతే ఫలితం ఉంటుందని ఆయన వివరించారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలకు అక్షరాభ్యాసం చేయించాలని, తల్లిదండ్రులు, విద్యావేత్తలు, శ్రేయోభిలాషులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

**ప్రజాపక్షం/తానూర్ :** విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలో రాణించాలని ఎంఈఓ నరేందర్ అన్నారు.గురువారం మండల కేంద్రంలోని వాగ్దేవి విద్యా నికేతన్ హైస్కూల్ లో ఎంఈఓ నరేందర్,తో పాటు గ్రామ సర్పంచ్ జాదవ్ సుగంధ బాయిమాదవ్ రావ్ పటేల్,ఉప సర్పంచ్ ఫారుక్,ముఖ్య అతిథులుగా హాజరై, రిబ్బన్ కట్ చేసి కేవలం పుస్తక పఠనానికే పరిమితం కాకుండా,అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని వారు అభినందించారు.ఆసక్తిగా తిలకించారు,వంటల తయారీ విధానంను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాభివృద్ధిపై కూడా దృష్టి సారించాలని వారు సూచించారు.ఆకట్టుకుంది.పాఠశాల కరస్పాండెంట్ అరవింద్ రెడ్డి,ప్రిన్సిపాల్ కిరణ్మయి,డైరెక్టర్ అవినాష్,మాజీ సర్పంచ్ మాధవ్ రావ్ పటేల్,ఎంపిపిఎస్ ప్రధానోపాధ్యాయులు సుధాకర్,సీఆర్పీ గంగాధర్,వార్డు సభ్యులు పవార్ సాయినాథ్,పండరి ,వాజీద్,నాయకులు నాగేష్,యోగేష్,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడలపైన దృష్టి సారించాలి



**ప్రజాపక్షం/లక్ష్మణచందా :** క్రీడల ద్వారా శారీరక అభివృద్ధితో పాటు మానసిక ఉల్లాసం ఉంటుంది కావున విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పైన దృష్టి సారించాలని జిల్లా పరిషత్ హై స్కూల్ పీచర క్లస్టర్ లో సీఎం కప్ క్రీడల ప్రారంభోత్సవంలో పాల్గొని ఎంపీడీవో రాధా రాథోడ్ మాట్లాడారు.

## అక్రమాలకు పాల్పడుతున్న డీలర్

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని పిప్రి గ్రామంలోని రేషన్ షాపు పై ఇటీవల ఆరోపణలు రాగా ప్రతిక కథనానికి స్పందించి తాసిల్దారు స్పందించి పిప్రి గ్రామంలోని రేషన్ షాపు ఇన్స్పెక్టర్ తో కలిసి విచారణ జరపగా తూకంలో అరకిలో తక్కువ బియ్యం పంపిణీ చేయడం మోసం జరుగుతుందని అలాగే గ్రామస్తులు ఆరోపణ ప్రకారం సమయపాలన పాటించడం లేదని తదితర సమస్యలు తెలిపారు.పై అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని ఎమ్మార్వో భోజన్న తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ లలిత పాల్గొన్నారు.

## ఖమ్మంలో పిడిఎస్‌యూ రాష్ట్ర మహాసభలు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఖమ్మం పట్టణంలో జనవరి 23,24,25 తేదీలలో నిర్వహించ తలపెట్టిన ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్‌యు)తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు.ఈ మేరకు జిల్లా కేంద్రంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో మహాసభల గోడప్రతులను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పిడిఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి వాగ్మారే మహేందర్,జిల్లా ప్రధాన కార్యదర్శి పవార్ కిరణ్ మాట్లాడుతూ 53 ఏళ్ల పోరాట చరిత్ర కలిగిన తమ సంఘం విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం శ్రమిస్తోందని తెలిపారు. విద్యారంగం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాఠశాలలకు 'మన ఊరుమన బడి' నిధులు ఇప్పటికీ విడుదల కలేదని,జూనియర్ కళాశాలల మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణమే ప్రారంభించాలని,రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు ,ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని వారు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీ య విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయబోమని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు.

## కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌గా బట్టు తిరుపతి

ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబును కలిసిన కమిషనర్

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్‌నగర్ పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా బట్టు తిరుపతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతిపై వచ్చిన ఆయన బాధ్యతలు చేపట్టిన అనంతరం పట్టణ అభివృద్ధిపై తన ప్రణాళికను వెల్లడించారు. ఈ సందర్భంగా బట్టు తిరుపతి మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం, తాగునీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలకు తొలి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి సిర్పూర్ నియోజకవర్గ ఎంఎల్ఏ పాల్వాయి హరీష్ బాబును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

# మూడవ రోజు ధూమ్ ధామ్‌గా సాగిన నిర్మల్ ఉత్సవాలు

### అదనపు కలెక్టర్,(రెవెన్యూ)కిషోర్ కుమార్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ ఉత్సవాలు ధూమ్ ధామ్ గా సాగాయి.ఉదయం నుంచి పట్టణవాసులు,గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలి వచ్చి స్టాల్స్ ను సందర్శించారు.రుచికరమైన ఆహార పదార్థాలు ఆస్వాదించారు.చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట విడుపు ప్రదేశంలో పిల్లలంతా కేరింతలు కొడుతూ,ఉత్సాహంగా గడిపారు.చిన్న పెద్ద తేడా లేకుండా నిర్మల్ ఉత్సవాల ఆనందాన్ని అనుభూతి చెందారు.సాయంత్రం నుంచి రాత్రి వరకు కొనసాగిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.మూడో రోజు వేడుకల్లో బుధవారం రాత్రి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కిషోర్ కుమార్ పాల్గొన్నారు.సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన తిలకించారు.మూడవ రోజు నిర్మల్ ఉత్సవాల కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి,ఇతర అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# సారంగాపూర్ రాజకీయాల్లో 'కండువాల 'వేట..!

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** నిర్మల్ జిల్లాలో రాజకీయ చైతన్యానికి మారుపేరుగా నిలిచే సారంగాపూర్ మండలంలో ప్రస్తుతం పార్టీల ఆధిపత్య పోరు పరాకాష్టకు చేరింది.ప్రజల కోసం ఐక్యంగా ఉండాల్సిన సర్పంచుల సంఘం కాస్తా పార్టీల లాగులాటలో రెండు ముక్కలై నవ్వులపాలవుతోంది.అటు కాంగ్రెస్,ఇటు బీజేపీ నేతలు''సర్పంచులు మావాళ్లంటే మావాళ్లు''అంటూ రాత్రికి రాత్రే కుండువాలు కప్పేస్తూ రాజకీయ చదరంగాన్ని తలపిస్తున్నారు.




### సర్పంచుల సంఘం చీలిక..
### ఎవరికి వారే యమునా తీరే.!

32 గ్రామ పంచాయతీల్లో 4 ఏకగ్రీవం కాగా,మిగిలిన 28 చోట్ల ఎన్నికలు జరిగాయి.వ్యయప్రయాసలకోర్చి స్వతంత్రంగా గెలిచిన అభ్యర్థులను కూడా వదలకుండా పార్టీలు గాలం వేస్తున్నాయి.ఐక్యమత్యంగా ఉండాల్సిన సర్పంచుల సంఘం అధ్యక్ష పదవి కోసం రెండు వర్గాలుగా విడిపోయి,జిల్లా స్థాయిలో సారంగాపూర్‌ను చర్చనీయాంశంగా మార్చారు.తమ రాజకీయ పంతం కోసం మండల ప్రతిష్టను తాకట్టు పెడుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

### వార్డు మెంబర్లనూ వదలని లాబీయింగ్..!

సర్పంచుల పోరు సరిపోదన్నట్లు ఇప్పుడు పార్టీల కళ్లు వార్డు మెంబర్లపై పడ్డాయి.మండల కేంద్రంలో బీజేపీ కండువా కప్పుకున్న ఇద్దరు వార్డు మెంబర్లను,మరుసటి రోజే కాంగ్రెస్ నేతలు మళ్ళీ తమ పార్టీలోకి లాగేసుకున్నారంటే ఇక్కడ రాజకీయాలు ఎంతలా వేడెక్కాయో అర్థం చేసుకోవచ్చు.ఉదయం ఒక కండువా,సాయంత్రం మరో కండువా అన్న చందంగా ప్రజా ప్రతినిధుల తీరు మారడం గమనార్హం..


### రాజకీయ ఉనికి కోసం
### ప్రజాస్వామ్యం అపహాస్యం..!

ఈ ఆధిపత్య పోరు కేవలం పదవుల కోసమే కాకుండా,రాబోయే ఎన్నికల్లో మండలంలో తమ పట్టు నిరూపించుకోవాలనే అగ్ర నాయకుల వ్యూహంగా కనిపిస్తోంది.పార్టీలు మారుతున్న ప్రజాప్రతినిధులు అస లు ఏ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారో అర్థం కాక ఓటర్లు తలలు పట్టుకుంటున్నారు.అభివృద్ధిని విస్మరించి, కేవలం సంఖ్యాబలం కోసం ప్రజాప్రతినిధులను 'బజారు వస్తువులుగా' మారుస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.రాత్రిపూట రహస్య ఒప్పందాలు, పగలు బహిరంగ సన్మానాలతో సారంగాపూర్ రాజకీయం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

### ప్రజల ప్రశ్న..అభివృద్ధి ఎక్కడ..?

మహాసభలు పెట్టి సన్మానాలు చేయడం,రాత్రికి రాత్రే కండువాలు మార్చడంపై కార్యకర్తలు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు.గెలిచిన నాయకులు ప్రజా సమస్యలను పట్టించుకుంటారా..?లేక పార్టీల పోరులోనే కాలం గడుపుతారా..?అని మండల ప్రజలు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు.బీఆర్ఎస్ పార్టీ కూడా వచ్చే ఎన్నికల వ్యూహంతో సిద్ధమవ్వడం గమనార్హం.

# రోడ్డు కిందకు దూసుకెళ్లిన స్కూలు బస్సు



**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ పట్టణంలోని చెక్కి తలబ్ వద్ద పట్టణంలోని శ్రీసాయి ప్రసన్న స్కూల్ వ్యాన్ రోడ్డు కిందకు దూసుకు వెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో స్కూల్ వ్యాన్ లో విద్యార్థులు ఉన్నారు. అదృష్ట వశాత్తు విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. గమనించిన స్థానికులు విద్యార్థులను జాగ్రత్తగా తీశారు. విద్యార్థులకు ఏమి కాకపోవడంతో వారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గల కారణం ఏమిటా అని తెలియాల్సి ఉంది.

# నామినేషన్ల కేంద్రాన్ని పరిశీలించిన అదపు కలెక్టర్

**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ మున్సిపాలిటీ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నామినేషన్ కేంద్రాల ఏర్పాట్లను అదనపు కలెక్టర్ అంకిత్ కుమార్ పరిశీలించారు. మున్సిపాలిటీలో కొనసాగుతున్న ఎన్నికల ఏర్పాట్లపై ఆరా తీశారు. ఎన్నికల ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

# మార్మోగిన సత్యసాయి నామస్మరణ

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** శ్రీసత్యసాయి నామస్మరణతో ఖానాపూర్ పట్టణం మార్మోగింది.పట్టణంలోని ప్రధాన రహదారి భక్తులతో కిటకిటలాడింది.శ్రీసత్యసాయి బాబా ప్రేమ వాహిని రథం నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి గురువారం ఖానాపూర్ పట్టణన కేంద్రంలో ప్రవేశించగా శ్రీ సత్యసాయి సేవా సంస్థల సభ్యులు,కన్వీనర్,ఎంపీవో చిక్యాల రత్నాకర్ రావు ఆధ్వర్యంలో భక్తులు ప్రేమ వాహిని రథం కార్యక్రమాన్ని జంగల్ హనుమాన్ ఆలయం వద్ద అట్టహాసంగా ప్రారంభించారు.శ్రీ సత్యసాయి బాబా రథం ఎదుట భజన నిర్వహించగా భక్తులు లీనమై పులకించిపోయారు.శ్రీ సత్యసాయి చిత్రంతో సాగిన రథోత్సవాన్ని తిలకించేందుకు ఖానాపూర్ పరిధిలోని గ్రామాల భక్తులు ఎగబడ్డారు.అంతకుముందు విద్యార్థుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాకాంత్,తహసీల్దార్ సుజాత,శ్రీ సత్యసాయి సేవా




జిల్లా అధ్యక్షుడు బీమ్ సింగ్,సభ్యులు హరించందన్ రెడ్డి,ఖానాపూర్ కన్వీనర్,ఎంపీవో చిక్యాల రత్నాకర్ రావు,రాజశ్రీ,మధుకర్,సభ్యులు వినోద్,చింతపండు సత్తయ్య,బాలసు రాజేశ్వర్,గంగాధర్,మొగిలి ,మహేష్, పంచాయతీ కార్యదర్శులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# పిల్లలకు సద్బుద్ధి నేర్పిస్తే జ్ఞానం పెరుగుతుంది

**ప్రజాపక్షం/బోధన్:** పిల్లలకు సద్బుద్ధి నేర్పిస్తే వారికి జ్ఞానం పెరుగుతుందని మల్లారం ఆశ్రమం వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహారాజ్ అన్నారు. బోధన్ పట్టణంలోని తట్టి కోట్ ప్రాంతంలో బజరంగ్‌దళ్ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో 70అడుగుల జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్లారం లింగేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహాజరై హాజరై కాషాయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గో సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ధర్మాన్ని కాపాడుతూ తల్లిదండ్రులను గౌరవించాలన్నారు.

యువత పెడదారి పట్టకుండా చూస్తూ వారిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాసిని వినోద్ భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు గోపి కిషన్, రుద్ర సత్యనారాయణ, వార్డు ప్రజలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# రోడు ప్రమాదంలో గాయపడిన కుప్టి సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/బైంసా :** గత మూడు రోజుల క్రితం బైంసా సుద్ద వాగు వంతెన వద్ద జరిగిన రోడు ప్రమాదంలో కుప్టి సర్పంచ్ గంగారం తీవ్రంగా గాయపడి నిజామాబాద్ లోని మనోరమ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడం తో బాధితున్ని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ పరామర్శించారు.ఆయన ఆరోగ్య విషయమై డాక్టర్ లను అడిగి తెలుసుకున్నారు.మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.ఆందోళన చెందావద్దని తానున్నాని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.

# నిత్యాన్నదాన సత్రం ప్రచారకార్యదర్శిగా శ్రీకాంత్‌గౌడ్ నియామకం

**ప్రజాపక్షం/సిరికొండ :** గౌడ నిత్యాన్నదాన సత్రం ప్రచార కార్యదర్శిగా నియామకమయ్యారు. జగిత్యాల జిల్లాలో ప్రముఖ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి సన్నిధిలో ఏర్పాటు చేసిన గౌడ ప్రభంజనం సేవా చారిటబుల్ ట్రస్ట్ గౌండ్ల ఆడబిడ్డ శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి గౌడ నిత్యాన్నదాన సత్రం ట్రస్ట్ కమిటీని ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ మంద వేణుగోపాల్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన నూతన కమిటీలో మండలంలోని పెద్దవాల్గోట్‌కు చెందిన కోరేపు శ్రీకాంత్‌గౌడ్‌ను గౌడ నిత్యాన్నదాన సత్రం ప్రచార కార్యదర్శిగా నియామకంచేసిన ట్రస్ట్ గౌరవ చైర్మన్ గంధమల్ల రాములు గౌడ్, ఫౌండర్ అండ్ చైర్మన్ మంద వేణుగోపాల్‌గౌడ్ ట్రస్ట్ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. నాపై నమ్మకంతో ట్రస్ట్ ప్రచార కార్యదర్శిగా ఇచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ సత్రం అభివృద్ధికి తగిన సహకారమందిస్తానన్నారు. గౌడ నిత్యాన్నదానం సత్రం అభివృద్ధి సహకరించే వారు 839039290, 9441874557 లను సంప్రదించాలని కోరారు.

# కారు ఢీకొని బాలుని మృతి

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** కారు డ్రైవర్ నిర్లక్ష్యానికి బాలుడు మృతి చెందిన సంఘటన వేల్పూర మండలం మోతెలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి కారు వెనకాల ఆడుకుంటున్న గౌరవ్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయని వెంటనే ఆ బాలున్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. చికిత్స పొందుత బాలుడు మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. బాలుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన ప్రత్యేకాధికారి

**ప్రజాపక్షం/భీమ్‌గల్:** ప్రభుత్వజూనియర్ కళాశాలను ప్రత్యేకాధికారి దాసరిఒడ్డెన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా కలాశాలలో నిర్వహించే ప్రాక్టీకల్‌కు సంబంధించిన ఇంగ్లీష్ ప్రాక్టీకల ఎగ్జామినేషన్‌కు సంబంధించిన పేరెంట్స్ మీటింగ్‌కు సంబంధించిన సమాచారాన్ని వారు అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా కళాశాలో భౌతిక శాస్త్రానికి సంబంధించిన ఆన్‌లైన్ తరగతుల సమాచారంను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా జిల్లా ప్రభుత్వ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నర్సయ్య, ప్రిన్సిపాల్ జైపాల్రెడ్డి, అధ్యాపక బృందం, పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. స్థానిక ఎస్ హెచ్ గార్డెన్స్ లో డా.భాస్కర్ మడెకర్ నేత్ర వైద్యశాల రేకుర్తి సౌజన్యంతో వైద్యశాల వైస్ ఛైర్మన్ లయన్ చిదుర సురేష్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 120 మందికి కంటి చూపు పరీక్షలు నిర్వహించారు. వీరిలో 46 మందికి మోతె బిందువును గుర్తించి శస్త్ర చికిత్స కై ఉచితంగా బస్సు ఏర్పాటు చేసి వారిని రేకుర్తికి తరలించారు.


# క్షేత్ర స్థాయిలో ప్రజాపోరాటాలను ప్రభుత్వ దృష్టికి 'ప్రజాపక్షం'లక్ష్యం

### భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి సుధాకర్



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** దేశంలో పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు తమ హక్కులను పొందారంటే, క్షేత్రస్థాయిలో ప్రజాపోరాటాలను ప్రభుత్వ దృష్టికి తేవడం ప్రజాపక్షం లక్ష్యం అని బారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్తాయిలో పార్టీ చేసిన ప్రజా పోరాటాలను, అధికారుల అలసత్వాలను ప్రభుత్వం, ప్రజల దృష్టికి తేవడంలో ప్రజాపక్షం పత్రిక తోడ్పాటు ఎంతో ఉందన్నారు. నిజాన్ని నిర్బయంగా వ్యక్తపరచటంలో ప్రజాపక్షం ముందుంటుందన్నారు. ప్రజాస్వామ్యంలో పార్టీ పరంగా చేసే పోరాటాలను, నాయకుల, ప్రజల బావ వ్యక్తీకరణకు ప్రజాపక్షం ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి వై. ఓమయ్య, జిల్లా ప్రతినిది కరకరమేష్, విజయ్ కుమార్, ఇమ్రాన్ అలీ, లింగం తదితరులున్నారు.

# నేడు నిజామాబాద్‌కు డిజిపి



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** శుక్రవారం తెలంగాణ రాష్ట్ర డిజిపి బి. శివదర్ రెడ్డి అరైవ్ అలైవ్ కార్యక్రమం మద్యాహ్నం 12 గంటలకు నిజామాబాద్ నగరంలోని బైపాస్ చౌరస్తాలో పాల్గొననున్నారని, నిజామాబాద్ రూరల్ పోలీసు స్టేషన్లను, మాక్లూర్ పోలీసు స్టేషన్‌లను ప్రారంబించనున్నారని, మధ్యాహ్నం 3 గంటలకు నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలోని ఆడిటోరియంలో నిజామాబాద్ సెక్యూరిటి కౌన్సిల్‌ను ప్రారంభించడం జరుగుతుందని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు.

# కుటుంబాలకు తగిన న్యాయం చేయాలి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని డా.విశారాదన్ మహారాజ్ అన్నారు.జగిత్యాల జిల్లా గొల్లపల్లి కేంద్రంలో బిసి, ఎస్సి,ఎస్టీ,జే ఏ సి రాష్ట్ర చైర్మన్ డా, విశారధన్ మహారాజ్ ఒక లక్ష కిలో మీటర్ల మా భూమి రథ యాత్ర లో బాగంగా గురువారం మండల కేంద్రం లోని నల్ల గుట్ట వడ్డెర కాలనీ సందర్శించి 25 సంవత్సరాలుగ నివాసముంటూ పట్టాలు లేని 20 కుటుంబాలను కలిసి వారి యొక్క సమస్యలను తెలుసుకొని వారికి ప్రభుత్వం తగిన న్యాయం చేయాలి అన్నారు.వారికి తగిన న్యాయం జరగకపోతే జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు బాధితులతో కార్యాలయన్ని ముట్టడి చేస్తామని డా,విశారదన్ మహారాజ్ అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి శ్రీకాంత్,జిల్లా ఇంచార్జి శివ,అధ్యక్షుడు మనాల కిషన్,శ్రీనివాస్ చారి, అశోక్, తిరుపతి, లక్ష్మ ణ్,జాని,మధుసూదన్, పాల్గొన్నారు.

# ఇందూరు గడ్డపై కమల వికాసం తథ్యం

### అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** రానున్నమునిసిపల్ ఎన్నికల్లో నిజామాబాద్ కార్పొరేషన్‌లో కమలం వికసిస్తుందని ఇందూరు గడ్డపై కాషాయ జెండా రెపరెపలాడుతుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. గురువారం కార్పొరేషన్ పరిధిలోని 43,52,28, 51, 14,15 డివిజన్ లలో కోటి రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు భూమి పూజలు చేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రదానమంత్రి పదవిలోకి వచ్చిన తర్వాత భారతదేశం తిరుగులేని శక్తిగా ఎదిగిందన్నారు. మోడి నాయకత్వంలో ఉన్న భారతదేశం తిరుగులేని శక్తిగా విశ్వగురువుగా ఎదుగుతుందన్నారు. ప్రధాని మోడీ పాలనలో దేశభక్తి, ఆధ్యాత్మిక చింతన, సనాతన దర్మం రోజురోజుకు పెరుగుతున్నాయని భారతీయులంతా బిజెపి వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. మహారాష్ట్ర మునిసిపల్ ఎన్నికల్లో బిజెపి సాదించిన తిరుగులేని విజయమే ఇందుకు నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఏ.ఈ. శంకర్, మునిసిపల్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

# సిఎం కప్ క్రీడా పోటీలకు ఎంపికైన మోర్తాడ్ క్రీడాకారులు

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలకు మోర్తాడ్ గ్రామ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 28, 29, 30 తేదిలలో జరిగే మోర్తాడ్ మండల స్థాయి సీఎం కప్ 2026 క్రీడా పోటీలకు మోర్తాడ్ గ్రామ ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడాకారులను ఎంపిక చేయడం జరిగింది. ఈ ఎంపికలకు ముఖ్య అతిథిగా స్థానిక గ్రామ సర్పంచి భోగ నిత్యనంద్, ఉప సర్పంచి సామ శ్రీనివాస్, వార్డు మెంబర్ మురళి, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ భోననగిరి శ్యామ్, గ్రామ కార్యదర్శి సైపోద్దీన్, సిఆర్‌పి సాయిరాం, వ్యాయామ ఉపాధ్యాయులు సుమన్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# ప్రథమ చికిత్స కేంద్రం సీజ్

**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ పట్టణంలోని ఓ ప్రథమ చికిత్స కేంద్రాన్ని జిల్లా వైద్య అధికారులు డాక్టర్ రాజశ్రీ సీజ్ చేశారు. బోధన్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి పరిసర ప్రాంతంలో కుమ్మన్‌పల్లి గ్రామ వాసి నరసింహ రెడ్డి నిర్వహిస్తున్న డిఎన్ రెడ్డి ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లో అనుమతులు లేని వ్యక్తి అల్లోపతి మాత్రలు ఉపయోగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కారణంగా పట్టణ ఎస్‌హెచ్‌ఓ వెంకట్ నారాయణ ఆద్వర్యంలో క్లినిక్‌ను సీజ్ చేశారు. ప్రజలు ఇలాంటి వారి పట్ల మోసపోకుండా ఉండాలని అర్హత కలిగిన డాక్టర్ల వద్ద చికిత్సలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు జిల్లా వైద్య అధికారిని డాక్టర్ రాజశ్రీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప వైద్యాధికారి డాక్టర్ సమత, బోదన్ డాక్టర్లు ప్రవీన్, సిబ్బంది రవి, నిర్మళ తదితరులు పాల్గొన్నారు.

# సిసి కెమెరాలతో కేసులు ఛేదించడం సాధ్యం

### బోధన్ ఎసిపి శ్రీనివాస్



**ప్రజాపక్షం/బోధన్:** సిసి కెమెరాల ద్వారా కేసులను త్వరగా చేదించడం సాధ్యమవుతుందని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. బోధన్ పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో గురువారం ఆయన ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. బోధన్ పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గత నెల జరిగిన బంగారు దుకాణంలో చోరీకి పాల్పడిన అంతరాష్ట్ర దోపిడి దొంగను అరెస్టు చేసి అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. అంతర్ రాష్ట్ర దోపిడి దొంగను బోధన్ పోలీసులు మీడియా ముందు ప్రవేశ పెట్టారు. గత నెల క్రితం జరిగిన బంగారాం దుకాణాల్లో నలుగురు అంతరాష్ట్ర దోపిడి దొంగలు దోపిడికి పాల్పడి 6కిలోల వెండి ఆభరణాలు, 14తులాల బంగారు ఆభరణాలు దొంగిలిచ్చినట్లు బాధితులు వెల్లడించారని ఏసీపీ పేర్కొన్నారు. దోపిడికి పాల్పడిన నలుగురిలో గతంలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని పలు ఆభరణాలు స్వాధీన పర్చుకున్నామని వివరించారు. ఏ4 నిందితుడు మహ్మద్ మౌలా నుంచి ఒక కిలో వెండి, ఐదు తులాల బంగారు ఆభరణాలు స్వాధీన పర్చుకొని రిమాండ్‌కు తరలించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడని, అతని కూడా త్వరలో పట్టుకుంటామన్నారు. నింధితులను పట్టుకునేందుకు కృషి చేసిన పట్టణ ఎస్‌హెచ్‌ఓ వెంకట్ నారాయణ, ఎస్సై మనోజ్, ఎఎస్సై బాబురావు, కానిస్టేబుల్ రవి, అనిల్ లను అభినందించారు. నింధితులు దొరకడానికి సహకరించిన కొండల్‌వాడి పోలీస్, ఉమ్రి పోలీస్ స్టేషన్, పోలీస్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. బోధన్ పట్టణంలో వ్యాపారాస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# ఎడపల్లిలో టిబి ముక్త్ భారత్ అభియాన్

### ఉచితంగా ఎక్స్‌రే తెమడ పరీక్షలు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని వ్యాధిసోకే ప్రమాదం ఉన్నవారు, లక్షణాలు ఉన్న వారిని గుర్తించి, వారికి ఉచితంగా ఎక్స్‌రేలు, తెమడ పరీక్షలు నిర్వహించారు. స్తానిక సర్పంచి కందగట్ల రాంచందర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత ప్రధాని మోదీ చేపట్టిన టీబీ ముక్త్ భారత్ లక్ష్యంలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారి జిల్లా టీబీ, హెచ్‌ఐవీ కోఆర్డినేటర్ రవి గౌడ్, వైద్యులు డాక్టర్ వినీత్ కుమార్ రెడ్డి, సూపర్ వైజర్‌లు రాజేశ్వర్, మాధవి లత, టీబీ సూపర్ వైజర్ అహ్మద్, సాంకేతిక సిబ్బంది, రేడియోగ్రాఫర్ రవికాంత్, ఉప సర్పంచి గంగాధర్, కౌన్సిలర్ శివ కుమార్, సాయి కిరణ్, ప్రశాంత్, వైద్య ఆరోగ్య సిబ్బంది, స్తానిక నాయకులు పాల్గొని, ప్రజలకు అవగాహన కల్పించారు.

# రాజాపూర్ గ్రామ రైతులకు, ముదిరాజ్ కులాస్తులకు సాగునీటి ఊరట

**ప్రజాపక్షం/రామగిరి :** రాజాపూర్ గ్రామంలో రైతుల సమస్యల పరిష్కారానికి స్థానిక రాజాపూర్ గ్రామ సర్పంచ్ పుల్లెల. భాగ్యలక్ష్మి కొమురయ్య రైతులు ముదిరాజ్ కులస్తుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని, సింగరేణి అధికారులతో చర్చలు జరిపి జెసిబి సాయంతో చెరువులోకి నీరు వచ్చే విధంగా కాలువ తీయించే ఏర్పాట్లు చేపట్టారు.ఈ చర్య ద్వారా గ్రామ చెరువులో నీరు నింపి, వ్యవసాయానికి అవసరమైన సాగునీటి సదుపాయం కల్పించడమే లక్ష్యంగా సర్పంచ్ పుల్లెల.భాగ్యలక్ష్మి కొమురయ్య పనిచేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రైతుల కష్టాలను అర్థం చేసుకుని, భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రజా ప్రయోజన కార్యక్రమాలు కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుండగా, ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్న నాయకత్వంపై విశ్వాసం మరింత పెరుగుతోందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారుఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కలవేనా. శ్రీకాంత్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నామిని కొమరయ్య, మాజీ వార్డ్ సభ్యులు వేల్పుల ఆంజనేయులు,సిద్ధం సతీష్ ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఎంపిడిఒ తీరుపై ఉద్యోగ సంఘాల ఆగ్రహం

### మహిళా ఉద్యోగిని దూషించడంపై నిలదీత

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి శంకర్ నాయక్ తీరుపై ఉద్యోగ సంఘాల నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కార్యాలయంలో పని చేసే సీనియర్ అసిస్టెంట్ అన్నపూర్ణను, అలాగే జూనియర్ అసిస్టెంట్ అభిలాష్ లను ఎంపీడీవో అకారణంగా దూషించారన్న విషయం తెలియడంతో గురువారం జిల్లా కేంద్రం నుంచి వివిద ఉద్యోగ సంఘాల బాధ్యులు తరలివచ్చి ఆయన్ని ఎంపీడీవో కార్యాలయంలో నిలదీశారు. స్థానిక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఎంపీడీవో శంకర్ నాయక్ ప్రతిరోజు కార్యాలయానికి ఆలస్యంగా వస్తూ, విధుల్లో ఉన్న సిబ్బందిని అనవసరంగా దూషిస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలోనే సీనియర్ అసిస్టెంట్ అన్నపూర్ణ పట్ల ఆయన ప్రవర్తించిన తీరుపై ఉద్యోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గడ్డం బాస్కర్ నేతృత్వంలో ప్రతినిధి బృందం కార్యాలయానికి చేరుకుంది. మహిళా ఉద్యోగుల పట్ల అనుచితంగా మాట్లాడటం సబబు కాదని, యూనియన్ నాయకులు ఎంపీడీవోను హెచ్చరించారు. ఆ సమయంలో ఎంపీడీవో సంజాయిషి ఇచ్చేందుకు ప్రయత్నించగా నాయకులు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కార్యాలయ ప్రాంగణంలో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎడపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది అంతా ఏకమై, తాము ఇక్కడ పని చేయలేమని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేస్తున్నా తమకు గుర్తింపు లేదని, పైగా దూషణలకు గురి కావాల్సి వస్తుందని, వెంటనే తమను ఇక్కడి నుంచి బదిలీ చేయించాలని యూనియన్ నాయకులను కోరారు.



# పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లేమి

### టిఆర్ టిఎఫ్ జిల్లా అధ్యక్షులు కృష్ణ ప్రసాద్ గౌడ్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతులు లేమి కారణంగా విద్యార్థుల సంఖ్య తగ్గుదలతో పాటు, ప్రాథమిక స్థాయిలో విద్య నాణ్యతను ప్రభావితం చేస్తున్నాయని టిఆర్ టిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ అన్నారు. గురువారం రుద్రంగి జెడ్ పి హెచ్ ఎస్ ఉన్నత పాఠశాలలో టిఆర్టిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం అత్యవసరంగా వ్యవస్థాపక, విద్యా పరమైన సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కోతరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తరగతి గదులు, తాగునీరు, శౌచాలయాలు, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని అన్నారు.